ప్రజా విశ్వంభర V3 NEWS

# ఓటీటీలో 'లెనిన్' ప్రభంజనం



అక్కినేని యువ హీరో అఖిల్ నటించిన 'లెనిన్' సినిమా థియేటర్లలో మంచి విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. రాయలసీమ నేపథ్యంలో తెరకెక్కిన ఈ యాక్షన్ డ్రామా ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా సత్తా చాటింది. ఇప్పుడు ఈ సినిమా ఓటీటీలోనూ అదే జోరును కొనసాగిస్తోంది. స్ట్రీమింగ్ ప్రారంభించిన కొద్ది రోజులకే భారీ రికార్డును సొంతం చేసుకుంది. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పీ, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ చిత్రానికి మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. ఆగస్టు 7 నుంచి 'లెనిన్' జీ5 ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. స్ట్రీమింగ్ ప్రారంభమైన కేవలం రెండు రోజుల్లోనే 100 మిలియన్ స్ట్రీమింగ్ మినిట్స్‌ను దాటినట్లు మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. దీంతో ఓటీటీలోనూ 'లెనిన్' సత్తా చాటుతోందనే చర్చ మొదలైంది. థియేటర్లలో విడుదలైన సమయంలో 'లెనిన్'కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. రూ.100 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ సినిమా అఖిల్ కెరీర్‌లో ప్రత్యేకమైన చిత్రంగా నిలిచింది. ముఖ్యంగా ఇప్పటి వరకు కనిపించని రా అండ్ రస్టిక్ లుక్‌లో అఖిల్ కనిపించడం అభిమానులను ఆకట్టుకుంది. థియేటర్లలో సినిమాను చూడలేకపోయిన వారితో పాటు మరోసారి చూడాలనుకున్న ప్రేక్షకులు కూడా ఓటీటీ వైపు మొగ్గు చూపడంతో జీ5లో సినిమాకు మంచి ఆదరణ లభిస్తున్నట్లు తెలుస్తోంది. కేవలం రెండు రోజుల్లోనే 100 మిలియన్ స్ట్రీమింగ్ మినిట్స్ దాటడం సినిమాపై ఉన్న ఆసక్తికి నిదర్శనమని చిత్రబృందం చెబుతోంది.

చిత్తూరు జిల్లా రామచంద్రపురం గ్రామంలో జరిగే ద్రౌపదమ్మ తిరునాళ్ల నేపథ్యంలో 'లెనిన్' కథ సాగుతుంది. స్నేహం, ద్రోహం, కోపం, పగ, ప్రతీకారం వంటి అంశాలను కలిపి దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు ఈ కథను తెరకెక్కించారు. లెనిన్‌కు ప్రాణ స్నేహితుడే ఎందుకు ద్రోహం చేశాడు? ఆ ద్రోహం అతడి జీవితాన్ని ఎలా మార్చింది? లెనిన్ జైలుకు వెళ్లడానికి కారణం ఏమిటి? రామచంద్రపురంలో చోటుచేసుకున్న ఘర్షణల వెనుక అసలు కథ ఏమిటి? చివరికి ఈ పోరాటంలో ఎవరు గెలిచారు? అనే అంశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. 'లెనిన్'లో అఖిల్ అక్కినేని ఇప్పటివరకు చేసిన పాత్రలకు పూర్తి భిన్నమైన అవతార్‌లో కనిపించారు. రా అండ్ రస్టిక్ లుక్‌తో పాటు పాత్రలోని భావోద్వేగాలను తన నటనతో బలంగా ఆవిష్కరించారని ప్రేక్షకులు ప్రశంసించారు. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాలు, ఎమోషనల్ సీన్స్‌లో అఖిల్ పెర్ఫార్మెన్స్‌కు మంచి స్పందన వచ్చింది.

### ప్రకృతి ఒడిలో

# బాలయ్య బ్యూటీ యోగాసనాలు



సినిమా ఇండస్ట్రీలో హీరోలు, హీరోయిన్లు ఇంత ఫిట్ గా ఉండడం వెనుక.. నిత్యం యోగ, జిమ్ వర్కౌట్స్ వారి జీవనశైలిలో భాగం అయిన విషయం తెలిసిందే.. అందుకే ఐదు కాదు కదా ఆరు పదుల వయసులో కూడా సెలబ్రిటీలు అంతే యంగ్ గా కనిపిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇకపోతే యోగా చేయాలి అంటే ప్రశాంతమైన వాతావరణం కూడా ఉండాలి. అలాంటి పచ్చని కొండల మధ్య అంతకు మించిన ప్రశాంతతను పొందుతూ యోగాసనాలతో అందరి దృష్టిని ఆకట్టుకుంది ప్రగ్యా జైస్వాల్. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ గ్లామర్ ఫోటోలతో సందడి చేసే ప్రగ్యా జైస్వాల్ తాజాగా ప్రశాంతమైన వాతావరణంలో యోగాసనాలు చేస్తూ కనిపించింది. మంచు కొండల్లో పచ్చని ప్రాంగణంలో ప్రశాంతతను పొందుతూ యోగాసనాలు చేస్తూ.. చూసే వారిని కూడా ఆకట్టుకుంది ప్రగ్యా జైస్వాల్. ఏది ఏమైనా తన అందాలతో కాకుండా యోగాసనాలతో ఈసారి అందర్నీ ఆకట్టుకోవడమే కాకుండా మనలో కూడా యోగ చేయాలనే ఆలోచనను కలిగిస్తోంది అంటూ నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు. మధ్యప్రదేశ్ లోని జబల్పూర్ లో జన్మించిన ప్రగ్యా జైస్వాల్ పూణేలోని సింబయోసిస్ లా స్కూల్లో చదివింది. అలా చదువుతున్న సమయంలోనే పలు రకాల అందాల పోటీలలో పాల్గొని సక్సెస్ఫుల్ మోడల్ గా ఎదిగింది.. కళా, సాంస్కృతిక రంగంలో ఆమె సాధించిన విజయానికి గాను సింబయాసిస్ సాంస్కృటిక్ పురస్కారం కూడా అందుకుంది. ఎన్నో ఉత్పత్తులకు బ్రాండ్ ప్రమోటర్గా పనిచేసిన ప్రగ్యా జైస్వాల్ కొన్ని పాపులర్ బ్రాండ్స్ కి అంబాసిడర్ గా కూడా పనిచేసింది. 2015లో తెలుగులో మిర్చి లాంటి కుర్రాడు అనే చిత్రంతో ఇండస్ట్రీకి పరిచయమైంది.. ఆ తర్వాత ప్రముఖ డైరెక్టర్ క్రిష్ దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా నటించిన కంచె సినిమాలో నటించిన ఏమేం సినిమాతో మంచి విజయాన్ని అందుకుంది. ఇందులో ఉత్తమ నటన కనబరిచినందుకుగాను ఉత్తమ నటి విభాగంలో గద్దర్ అవార్డును కూడా సొంతం చేసుకుంది. ఈ చిత్రం తర్వాత తెలుగులో ఓం నమో వెంకటేశాయ, గుంటూరోడు, నక్షత్రం, జయ జానకి నాయక ,ఆచారి అమెరికా యాత్ర, సైరా నరసింహారెడ్డి వంటి చిత్రాలు చేసింది. అయితే బాలకృష్ణ హీరోగా నటించిన అఖండ సినిమాతో మంచి విజయం లభించింది. ప్రస్తుతం టైసన్ నాయుడు అనే చిత్రంలో నటిస్తున్న ఈమె.. సన్నీ డియోల్ క్రైమ్ థ్రిల్లర్ సూర్యలో కూడా నటిస్తోంది . పైగా ఈ రెండు చిత్రాలు కూడా ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి.

# హాలీవుడ్ స్టార్‌కు నాపై క్రష్

**- మల్లికా శెరావత్**



బాలీవుడ్ హాట్ బ్యూటీ మల్లికా శెరావత్ మరోసారి తన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. హాలీవుడ్ సూపర్‌స్టార్ టామ్ క్రూజ్‌కు తనపై క్రష్ ఉందని, ఆయన తనకు పర్సనల్‌గా సోషల్ మీడియాలో మెసేజ్‌లు కూడా చేస్తుంటారని ఆమె చేసిన కామెంట్స్ ప్రస్తుతం బాలీవుడ్‌తో పాటు నెట్టింట తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో త్వరలో ప్రారంభం కానున్న ది ట్రెయిటర్స్ సీజన్2 రియాలిటీ షో ప్రమోషన్లలో భాగంగా ఆమె ఈ విషయాలను వెల్లడించారు.

షోలో భాగంగా తోటి కంటెస్టెంట్ మల్లికా షెరావత్‌ను ఉద్దేశించి, 'మీకు ఎప్పుడైనా ఎవరి మీదైనా క్రష్ ఉందా? లేక అందరికీ మీపైనే క్రష్ ఉందా?' అని ప్రశ్నించారు. దీనికి మల్లికా బదులిస్తూ, 'అందరికీ నాపైనే క్రష్ ఉంది. ఇటీవల కాలంలో హాలీవుడ్ స్టార్ టామ్ క్రూజ్ కూడా నాపై మనసు పారేసుకున్నారు. నేను అబద్ధం చెప్పడం లేదు. నా దగ్గర ఫోన్ ఉంటే ఆయన పంపిన వీడియోలను కూడా చూపించేదాన్ని' అంటూ ఆశ్చర్యకరమైన వ్యాఖ్యలు చేశారు. అయితే, ఆయన ఎలాంటి వీడియోలు పంపుతారని తోటి కంటెస్టెంట్లు ప్రశ్నించగా.. తామిద్దరం కలిసి పార్టీలలో పాల్గొన్న క్షణాలకు సంబంధించిన వీడియోలని తెలిపింది. ఇక టామ్ క్రూజ్ వ్యక్తిత్వం చాలా అద్భుతంగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. కాగా, మల్లికా షెరావత్ చేసిన ఈ వ్యాఖ్యలపై టామ్ క్రూజ్ గానీ, ఆయన ప్రతినిధులు గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. మరోవైపు ఇవి పూర్తిగా మల్లికా షెరావత్ చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలుగానే మిగిలిపోయాయి.

**'ది ట్రైటర్స్ సీజన్ 2' విశేషాలు**

వ్యూహాలు, మోసాలు, ఎత్తుగడల ఆధారంగా సాగే ప్రసిద్ధ రియాలిటీ షో 'ది ట్రైటర్స్'. ఇందులో కంటెస్టెంట్లను రహస్యంగా నమ్మకస్తులు, ద్రోహులు అని రెండు రకాలుగా విభజిస్తారు. నమ్మకస్తులు ద్రోహులను గుర్తించి ఏరివేయాలని ప్రయత్నిస్తే, ద్రోహులు తమ గుర్తింపును బయటపెట్టకుండా ఇతరులను ఎలిమినేట్ చేయాల్సి ఉంటుంది. ఈ సీజన్‌లో మల్లికా షెరావత్‌తో పాటు మునవర్ ఫరూఖీ, శ్వేతా తివారీ, రణవీర్ బ్రార్, రియా చక్రవర్తి, క్రిస్టల్ డిసౌజా, దలీప్ తాహిల్, పరుల్ గులాటి, షహ్నాజ్ గిల్, హర్మన్ సింఘా, ఇక్కా, సాహిల్ సలాథియా, అభిషేక్ మల్హన్ తదితరులు పోటీలో పాల్గొంటున్నారు.

# కూతురి కోసం దీక్ష, ఊరి కోసం పోరాటం



మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా తెరకెక్కితోన్న సినిమా 'ఇరుముడి'. తన కెరీర్లో ఓ ప్రత్యేకమైన చిత్రంగా రవితేజ అభివర్ణించడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక 'ట్రైలర్' విడుదల కావడంతో ఈ సినిమాపై భారీ హైప్ క్రియేట్ అవుతోంది. ట్రైలర్ చూసిన అభిమానులు రవితేజ ఖాతాలో మరో సూపర్ హిట్ మూవీ అంటూ సోషల్ మీడియాలో కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్ తో నిర్మిస్తుండగా.. దర్శకుడు శివ నిర్వాణ సరికొత్త కథాంశంతో తెరకెక్కించారు. ఈ చిత్రంలో రవితేజ కుమార్తెగా బేబీ నక్షత్ర నటించింది. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ మూవీ ఆగస్టు 21న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సినిమాలో సాయి కుమార్ కీలక పాత్రలో కనిపించనుండగా.. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతమందించారు. ట్రైలర్ ప్రకారం, ఈ సినిమాలో రవితేజ 'త్రినాథ్' అనే తండ్రి పాత్రలో కనిపించనున్నారు. మద్యపానానికి బానిసైనప్పటికీ, తన కూతురి (బేబీ నక్షత్ర) బాగు కోసం ప్రతి ఏటా 41 రోజుల పాటు కఠినమైన అయ్యప్ప దీక్షను చేపడతాడు. ఆ సమయంలో సంపూర్ణంగా మద్యపానానికి దూరంగా ఉంటూ ఎంతో నిష్ఠగా ఉంటాడు. అయితే అదే సమయంలో వారి ఊరిలో వరుసగా పాఠశాల విద్యార్థినులు అనుకోని పరిస్థితుల్లో మరణిస్తుంటారు. ఈ హత్యల వెనుక ఉన్న నిజాన్ని ఛేధించే క్రమంలో త్రినాథ్ చిక్కుకుంటాడు. అయితే, దీక్ష నియమాల ప్రకారం ఎవరితోనూ గొడవ పడకూడదు, హింసకు పాల్పడకూడదు. సరిగ్గా ఇదే అదనుగా భావించిన ప్రతినాయకులు అతనిపై దాడులకు తెగబడతారు. దీక్షలో ఉన్న సమయంలో తన కూతురిని, ఊరి ప్రజలను ఎలా కాపాడుకున్నాడు? అనేదే ఈ చిత్ర కథాంశంగా తెలుస్తోంది. తండ్రీకూతుళ్ల మధ్య వచ్చే భావోద్వేగ సన్నివేశాలు, అయ్యప్ప భక్తి నేపథ్యం, ఉత్కంఠ రేపే మిస్టరీ, యాక్షన్ అంశాలతో ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది.

రవితేజకు జంటగా ప్రియా భవానీ శంకర్ నటిస్తుండగా, సీనియర్ నటుడు సాయి కుమార్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. 'మజిలీ', 'నిన్ను కోరి' వంటి విజయవంతమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

ఇప్పటికే విడుదలైన "ఇరుముడి కట్టు.. శబరిమల ఎక్కు.." పాట మంచి స్పందన రాబట్టుకోగా, ఇప్పుడు ట్రైలర్ కూడా సినిమాపై భారీ అంచనాలను నెలకొల్పింది. రొటీన్ కమర్షియల్ చిత్రాలకు భిన్నంగా, రవితేజ నుంచి ఒక కొత్త తరహా సినిమా రాబోతోందని ప్రేక్షకులు భావిస్తున్నారు.

# అజిత్ 'డేర్ డెవిల్'లో వెంకీ మామ



విక్టరీ వెంకటేష్ కేవలం హీరోగానే కాకుండా కథకు బలం ఇచ్చే కీలక పాత్రలు చేయడానికి ఎప్పుడూ ముందుంటారు. ఒకవైపు హీరోగా సూపర్‌హిట్ చిత్రాలు అందిస్తూనే, మరోవైపు స్టార్ హీరోల సినిమాల్లో నటనకు ప్రాధాన్యమున్న ప్రత్యేక పాత్రలను చేయడానికి ఆయన వెనుకాడరు. ఇప్పటి వరకు టాలీవుడ్‌లో మహేష్ బాబుతో సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, పవన్ కళ్యాణ్‌తో గోపాల గోపాల, అలాగే రామ్ తో మసాలా.. వరుణ్ తేజ తో ఎఫ్ 2, ఎఫ్ 3 వంటి మల్టీస్టారర్లలో నటించి మెప్పించారు. ఇక బాలీవుడ్‌లోనూ సల్మాన్ ఖాన్‌తో కలిసి కిసీ కా భాయ్ కిసీ కా జాన్ చిత్రంలో కీలక పాత్ర పోషించి అక్కడ కూడా అలరించారు.

ఇప్పటివరకు తెలుగు, హిందీ చిత్రాలకే పరిమితమైన వెంకీ మామ, ఇప్పుడు కోలీవుడ్‌లోకి గ్రాండ్ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు సినీ వర్గాల్లో బలమైన వార్తలు వినిపిస్తున్నాయి. తమిళ స్టార్ హీరో అజిత్ కుమార్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న డేర్ డెవిల్ చిత్రంలో వెంకటేష్ ఒక అత్యంత కీలకమైన పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రాన్ని ఈ మధ్యనే మేకర్స్ అధికారికంగా ప్రకటించడంతో పాటు టైటిల్ ని కూడా అనౌన్స్ చేశారు. సెప్టెంబర్ లో ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లనుంది. వెంకీ మామ ఈ సినిమాలో నటిస్తున్నట్లు తెలియడంతో ఒక్కసారిగా డేర్ డెవిల్ పై అంచనాలు పెరిగిపోయాయి.

ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో వెంకటేష్ అంగీకరించడం వెనుక ఫిలిం నగర్‌లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. అజిత్‌తో ఉన్న ప్రత్యేక అనుబంధం, స్నేహం కారణంగానే వెంకీ ఈ ఆఫర్‌కు సుముఖత వ్యక్తం చేశారని ఒక టాక్ నడుస్తుంటే.. మరోవైపు ఈ సినిమాలో ఆయన కోసం డిజైన్ చేసిన పాత్ర ఎంతో బలంగా ఉండటమే అసలు కారణమని అంటున్నారు. కేవలం పేరుకే కాకుండా కథను కీలక మలుపు తిప్పే క్యారెక్టర్ కావడంతోనే ఆయన ఓకే చెప్పినట్లు సమాచారం. దీనికి తోడు కోలీవుడ్ మేకర్స్ వెంకీ ఇమేజ్‌కు తగినట్లు భారీ పారితోషికాన్ని ఆఫర్ చేసినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా, వెంకటేష్ కోలీవుడ్ ఎంట్రీ ఇస్తే మాత్రం అటు తమిళంతో పాటు ఇటు తెలుగులోనూ డేర్ డెవిల్ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకడం ఖాయం. అజిత్ వెంకటేష్ కాంబినేషన్‌లో రాబోతున్న ఈ క్రేజీ మల్టీస్టారర్‌పై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుందని సమాచారం.

# రెడ్ డ్రెస్‌లో అందాల శూర్పణఖ



హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుంది. రెడ్ గౌన్‌లో దిగిన కొత్త ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. స్టన్నింగ్ లుక్‌లో రకుల్ ఇచ్చిన పోజులు అదరహో అనేలా ఉండటంతో అభిమానులను తెగ ఆకట్టుకుంటున్నాయి. ఈ ఫొటోలకు రెడ్ డ్రెస్‌లో అందాల శూర్పణఖ అంటూ కమెంట్ చేస్తున్నారు. అయితే తాను పాన్ ఇండియా సినిమా రమాయణలో శూర్పణఖ పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే..

తొలి సినిమా చేయడానికి కారణం నటనపై ఆసక్తి కాదని, కారు కొనాలనే కోరికేనని రకుల్ చెప్పడం విశేషం.ఆ రూ.5 లక్షలతో కారు కొనాలని అనుకున్నానని రకుల్ ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. మా ఫ్రెండ్స్‌లో అప్పటివరకు ఎవరి దగ్గరా కారు లేదు. నేను మొదటివారిగా కారు కొనాలి అనిపించింది. అదే ఆ సినిమా చేయడానికి ప్రధాన కారణం అని ఆమె నవ్వుతూ తెలిపారు. తొలి సినిమా కోసం దాదాపు 40 రోజుల పాటు షూటింగ్‌లో పాల్గొన్న తర్వాతే నటనపై తనకు నిజమైన ఆసక్తి పెరిగిందని రకుల్ చెప్పారు.కెమెరా ముందు పనిచేయడం నాకు చాలా నచ్చింది. అప్పడే గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక సినిమాలనే కెరీర్‌గా ఎంచుకోవాలని నిర్ణయించుకున్నాను. అందుకే మొదటి, రెండో సినిమాల మధ్య కొంత గ్యాప్ వచ్చింది. అలాగే కాలేజీ అటెండెన్స్, చదువుకు ఇబ్బంది కలగకూడదని కెరీర్ ప్రారంభంలో కొన్ని పెద్ద సినిమా అవకాశాలను కూడా వదులుకున్నాను. ఇండస్ట్రీలోకి నేను నా సొంత ప్రతిభతోనే వచ్చాను. ఎవరి సహాయం తీసుకోలేదు అని వివరించారు. రకుల్ ప్రీత్ సింగ్ 2009లో కన్నడ చిత్రం గిల్లీ తో హీరోయిన్‌గా పరిచయమయ్యారు. తెలుగులో మాత్రం 2013లో సందీప్ కిషన్ హీరోగా వచ్చిన వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ తో ఎంట్రీ ఇచ్చి తొలి సినిమాతోనే విజయాన్ని అందుకున్నారు.ఆ తర్వాత 'లౌక్యం', 'నాన్నకు ప్రేమతో', 'సరైనోడు', 'ధృవ', 'స్పైడర్', 'రారండోయ్ వేడుక చూద్దాం', 'ఖాకీ' వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించి స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. బాలీవుడ్‌లో కూడా 'యారియాన్', 'దే దే ప్యార్ దే' వంటి చిత్రాలతో మంచి గుర్తింపు పొందారు. వ్యక్తిగత జీవితంలో 2024లో నిర్మాత, నటుడు జాకీ భగ్నానీని వివాహం చేసుకున్న రకుల్.. ప్రస్తుతం దర్శకుడు నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక 'రామాయణ' చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాలో ఆమె శూర్పణఖ పాత్రలో కనిపించనున్నారు. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ భారీ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. RNI No : TGTEL/25/A1676, Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com